తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
28 జులై 2026
సంపుటి 03
సంచిక 287
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత అభిప్రాయం

న్యూఢిల్లీ,జులై 27 నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ

➢ మిగతా 2వ పేజిలో..

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

- మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు
- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా



న్యూఢిల్లీ,జూలై27 పార్లమెంట్ ఉభయసభల్లో గందంగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర

➢ మిగతా 2వ పేజిలో..




## ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్,జూలై27 రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని

➢ మిగతా 2వ పేజిలో..



## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

- కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ,జూలై27 గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం,

➢ మిగతా 2వ పేజిలో..

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



హైదరాబాద్,జూలై27 బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ,

➢ మిగతా 2వ పేజిలో..

## ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం
- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం,జూలై27 తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని

➢ మిగతా 2వ పేజిలో..

## ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

- విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం
- యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్



హైదరాబాద్,జులై 27 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు

➢ మిగతా 2వ పేజిలో..

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయువ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జులైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

## పదో తరగతి విద్యార్థిని శివానీ మృతి

### సీఎం పర్యటనలో ఉత్సాహంగా మాట్లాడి..అంతలోనే ఆత్మహత్య

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

అమరావతి,జులై27 సీఎం చంద్రబాబు రంప చోడవరం పర్యటనలో తన ప్రసంగంతో ఆకట్టుకున్న పదో తరగతి విద్యార్థిని ఎం. శివాని చనిపోవడం చాలా విషాదం కలిగించిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి శివాని మృతిపై సోమవారం రాజధాని అమరావతిలో ఆమె స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివానీ ఇక లేదంటే నమ్మలేక పోతున్నానని అన్నారు. ఎంతో భవిష్యత్ ఊహించుకుని.. కలలుకన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరమని పేర్కొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు బలం కావాలి.. కానీ బలహీనత కాకూడదని వ్యాఖ్యానించారు. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని తనువు చాలించిందని చెప్పారు. ఈ విద్యార్థిని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. జీవితంలో సమస్యలు, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలని విద్యార్థులు, యువతకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని విద్యార్థులను కోరారు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. చనిపోవడానికి ఉన్న ధైర్యం బతకడానికి ఎందుకు చూపించరంటూ విద్యార్థులను ప్రశ్నించారు. బతికి ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు.ల్లూరి మన్యం జిల్లాలో రంపచోడవరంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శివాని 10వ తరగతి చదువుతోంది. జులై 24వ తేదీన రంపచోడవరంలో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శివాని.. తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకుంది. వచ్చే ఏడాది షైనింగ్ స్టార్ అవార్డు తీసుకుంటానని సీఎంకు ఆమె ధీమాగా చెప్పింది. దీంతో ఆ విద్యార్థిని పిలిచి.. సీఎం చంద్రబాబు తన పక్కన కూర్చొబెట్టుకున్నారు. శివాని మృతిపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఆమె మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలో కలహాల నేపథ్యంలో శివాని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

## కోలుకుంటున్న పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

అమరావతి,జులై 27: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోలుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్త్రపి వర్గాలు తెలిపాయి. శనివారం హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.

అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి..

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

హైదరాబాద్,జూలై27 హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 28 జూలై, 2026


## కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించిన 5కే వాక్




**కుత్బుల్లాపూర్ జులై 27 ( తరంగాలు )**
కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కౌసల్య కాలనీలోని "వెంకట్ బాడీ ఫిట్నెస్ జిమ్" ఆధ్వర్యంలో భారీ 5K వాక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిమ్ అధినేత వెంకట్ నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో కౌసల్య కాలనీ వాసులు, జిమ్ సభ్యులు, చిన్నలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ కౌసల్య కాలనీలోని జిమ్ వద్ద ప్రారంభమై మియాపూర్ బస్ డిపో వరకు, అక్కడి నుండి తిరిగి జిమ్ వరకు సాగింది. "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" "జై జవాన్" నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మారుమోగాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... 1999 జూలై 26న శ్రీనగర్ - లేహ్ రహదారిని తిరిగి స్వాధీనం చేసుకుని, పాకిస్తాన్‌పై లభించిన చారిత్రాత్మక విజయాన్ని గుర్తుచేసుకున్నారు. భారత సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ, ఫిట్‌నెస్‌తో పాటు దేశభక్తిని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం జూలై 26న ఇటువంటి 5K వాక్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దేశ సరిహద్దుల్లో నిరంతరం కాపలా కాస్తూ మనల్ని కాపాడుతున్న జవాన్ల త్యాగాలను స్మరిస్తూ, కాలనీ వాసులంతా కార్గిల్ విజయ్ దివస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ మత్స్యగిరి ఆలయంలో వరణ యాగం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి 27 తరంగాలు**
మండల పరిధిలోని శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం వరుణ యాగం నిర్వహించి వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా పండించాలని, ప్రజలంతా సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడమైనదని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కే.వెంకటయ్య, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## తపస్ రాష్ట్ర స్థాయి పోస్టర్ ఆవిష్కరణ




**జఫర్గడ్ ప్రతినిధి, జులై 27,(తరంగాలు):**
తపస్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తపస్ రాష్ట్ర స్థాయి మహా ధర్నా పోస్టర్ ను జనగామ జిల్లా తపస్ ప్రధాన కార్యదర్శి అంకం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జడ్ పి హెచ్ యస్ తిమ్మంపేట లో ఆవిష్కరించిన జాఫర్ ఘడ్ మండల విద్యాధికారి మంగు జయప్రకాష్ తపస్ మండల ప్రధాన కార్యదర్శి బండారి సత్యనారాయణ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద జరిగే తపస్ మహా ధర్నా ను విజయవంతం చేయాలని అంకం సతీష్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు, పి ఆర్ సి ని ప్రకటించి వెంటనే అమలు, పెండింగ్ డిఏలు జిపిఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,317 జీవో తో నష్టపోయినవారికి న్యాయం చేయాలని.. జీవో నెంబర్ 25 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించాలని వారన్నారు. జడ్ పి హెచ్ యస్ తిమ్మంపేట లోని ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో మండల ఆర్‌పిలు మహేందర్, నాగరాజం, ఉపాధ్యాయ ఉపాధ్యాయిని లు పాల్గొన్నారు.

## అమ్మ రెస్టారెంట్ హోటల్ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి.



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.27, తరంగాలు:**
కేసముద్రం మండల కేంద్రము లోని జోతిరావు పులే సెంటర్ దగ్గరలోఅమ్మ రెస్టారెంట్ ఏ సి మరియు నాన్ ఏ సి హోటల్ ప్రోపరీటర్ స్వాతి ప్రకాశ్ లు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి నీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించగా వారు వొచ్చి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ రెస్టారెంట్ హోటల్ ప్రజలకు రుచికరమైన భోజనం సదుపాయాలు కలిగి ఉన్నందున హోటల్ ప్రోపరేటర్ స్వాతి ప్రకాష్లు వ్యాపార రీత్యా ముందుకు సాగి దినదినాభివృద్ధి చెందాలని వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కేసముద్రంలో ఇలాంటి రెస్టారెంట్ హోటల్ ఉన్నందున ప్రజలు యొక్క సదుపాయాలను వినియోగించుకోవాలని సూచన చేశారు ఈ కార్యక్రమంలో. కేసముద్రం సీఐ. సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, ఆర్టిఏ నెంబర్ రావుల మురళి,మార్కెట్ మాజీ చైర్మన్ సువాసిని దుర్గేష్, ధన్నసరి మాజీ ఉపసర్పంచ్ చిన్న వెంకన్న, కౌన్సిలర్లు పాయిరాల శరత్, యాదవ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి

## సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ
- జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, పరిశుభ్రత, సిబ్బంది హాజరుపై సమగ్ర సమీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ జూలై 27**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలు, జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి వార్డులు, మరుగుదొడ్లు, ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స అందించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని ఆదేశించారు. ప్రయోగ శాలలో మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవీ పరీక్షలకు అవసరమైన టెస్టింగ్ కిట్లు, మందుల నిల్వలు, యాంటీ స్నేక్ వెనం ఇంజక్షన్ల లభ్యతను పరిశీలించిన కలెక్టర్, ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, సమయపాలనతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అలాగే ఆయుష్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించిన ఆయన, చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం పెరిగేలా ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం, అవసరమైన మందులు, పరీక్షా సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ తనిఖీలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్లు, పారిశుధ్యం, మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి జూలై 27 తరంగాలు**
వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి జగన్నాథ్ రావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం పురోగతి, గ్రామస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనుల గుర్తింపు,కూలీల సమీకరణ, స్వచ్ఛ భారత్ మిషన్ ఎస్‌బీఎం నిబంధనల సమర్థవంతమైన అమలు,మ్యాజిక్ సోక్‌పిట్లు,కమ్యూనిటీ సోక్‌పిట్లు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఓపెన్ వెల్ రీచార్జ్ పనులు, తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీతో చేపడుతున్న ఫార్మ్ పాండ్‌లు మరియు కామన్ సోక్‌పిట్ల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పురోగతి,వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా, వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి,ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు,గ్రామ పంచాయతీలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో, ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటిని సంరక్షించడం అత్యంత అవసరమని సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమంను సమర్థవంతంగా అమలు చేసి,వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నీటి వనరుల స్థిర వినియోగానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి,గ్రామాల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి జగన్నాథ్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి,మండల పంచాయతీ అధికారి ఎంపీఓ వై. ప్రేమలత, వ్యవసాయ అధికారి శ్రీమతి శృతి, పంచాయతీ రాజ్ సహాయ ఇంజనీర్ జి. సందీప్ రెడ్డి,ఏపీఓ పరుశురాములు,ఏపీఎం అంజయ్య, ఈసీ బి.పి. విక్రమ్,హౌసింగ్ సహాయ ఇంజనీర్లు కిరణ్,టి. అశోక్,మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



### గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే

## ఉత్తమ వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర.టిఎస్
- ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం బోనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉంటున్నారా, అవసరమైన పరీక్షలు, మందులు సకాలంలో అందుతున్నాయా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీసారు. ఆసుపత్రిలోని ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్ అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని సూచించారు.

మందుల వినియోగం, గడువు తేదీలు, నిల్వల నమోదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పారదర్శకంగా నిర్వ హించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రతి వైద్యుడు, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట బోనకల్ తహసీల్దార్,సంబంధిత శాఖల అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
మంగళవారం, 28 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఘనంగా అడ్వకేట్ మాడపాటి శివానంద్ జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్ జులై 27 ( తరంగాలు )**
గాజులరామారం సర్కిల్ మహాదేవపురం డివిజన్ యండమూరి లేఔట్ కాలనీకి చెందిన బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్, అడ్వకేట్ మాడపాటి శివానంద్ జన్మదిన వేడుకలు సోమవారం గాజులరామారంలోని ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ రామారావు, వీణా వరకాల ,మధుసూదన్, శ్రీనివాస్ ,బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బక్క శంకర్ రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘాల సభ్యులు హాజరై శివానంద్‌కు పూల మాలలు వేసి శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మహాదేవపురం డివిజన్‌లోని పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, హిందూ సంఘాల నాయకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన జర్నలిస్టులు కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టు అసోసియేషన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగ్రీవుడు ముదిరాజ్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు భాన్సాడ వెంకటేష్, గణేష్, బాలరాజ్, కే.ఎస్. రాజు, బక్కని పాండు ముదిరాజ్, యాకూబ్, శివకుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలు ఆత్మీయ వాతావరణంలో సాగగా, హాజరైన ప్రముఖులు అడ్వకేట్ శివానంద్ సామాజిక సేవలను అభినందిస్తూ, ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## "ఆరుతడి పంటల విత్తన మేళా"ప్రారంభించిన ఏఎంసి వైస్ చైర్మన్ -శాఖమూరి హరిబాబు

- ఆత్మ డివిజన్ చైర్మెన్ -యడ్ల బిక్షం రెడ్డి
- పిఏసిఎస్ చైర్మెన్ వల్లె శ్రీను



**నర్సంపేట ప్రతినిధి, జులై :27(తరంగాలు)**
ఖానాపురం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరుతడి పంటల విత్తన మేళా కార్యక్రమాన్ని ఏ ఏం సి వైస్ ఛైర్మెన్ హరిబాబు, పి ఏ సి ఎస్ ఛైర్మెన్ వల్లె శ్రీను, ఆత్మ డివిజన్ ఛైర్మెన్ యడ్ల బిక్షం రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విధముగా, ఈ వానకాలం 2026 సీజన్లో, ఎల్నినో ప్రభావ కారణంగా, ఖానాపురం మండల రైతాంగం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. కావున ప్రత్యామ్నాయంగా, ఎక్కువ నీటితో పండే వరి పంట కాకుండా, తక్కువ నీటితో, తక్కువ కాలవ్యవధిలో పండేటటువంటి చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పు దినుసులు పండించుకోవాలని, రైతులకు అమ్ముట కొరకు మండలంలోని వివిధ విత్తన డీలర్లు, ఆరుతడి పంటల విత్తనాలు తీసుకొని వచ్చి, స్టాల్ లలో ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ సబ్సిడీలోఇస్తున్నదని, నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం రైతు వేదికల ద్వారా, రైతులకు అందిస్తున్నదని కావున రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో, మండల వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి తరుణ్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆశాదీప్, అంకుషావలి, వినోద్, మహేందర్ రైతులు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## కలాం ఆశయాలు విద్యార్థులకు ఆదర్శం



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 27, తరంగాలు:**
భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పేరుగాంచిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమవారం శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, డాక్టర్ అబ్దుల్ కలాం నిరాడంబర జీవితం, దేశాభివృద్ధి కోసం చేసిన సేవలు, యువతపై ఉంచిన విశ్వాసం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని కలాం సందేశాన్ని గుర్తు చేశారు. కలలు కనడం మాత్రమే కాకుండా వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని ఆయన సూచించిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలాం జీవిత విశేషాలను, శాస్త్ర సాంకేతిక రంగంలో ఆయన చేసిన విశేష కృషిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కలాం సూక్తులను చదివి ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

- ఎంఈఓ ఆఫీస్ ముందు సిపిఎం ధర్నా.



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి జూలై 27 తరంగాలు**
ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వలిగొండ ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందించలేదని వెంటనే యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం డైరీలను అందించాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడను నిర్మించాలని, అదేవిధంగా మండల వ్యాప్తంగా అనేక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేరాలని,విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండదని,పేరుతో పాఠశాలలను తొలగించే ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, డిప్యూటేషన్ పేరుతో ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు టీచర్ల బదిలీలను ఆపాలని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించేందుకు నిధుల కేటాయింపు పెంచాలని,అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్మెన్లను నియమించాలని, ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని, చెబుతూనే మరొకవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను వెంటనే మానుకోవాలని, ఇప్పటికే మండలంలో మూసివేసిన పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగిలి పాక గోపాల్, కొండే కిష్టయ్య, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగాయ్య, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల నాగరాజు, ధ్యానబోయిన యాదగిరి, కొండూరు సత్తయ్య, ఉండాటి పాపయ్య, గంగాపురం వెంకటేశం, ఏటెల్లి నరసింహ, కందుల మత్స్యగిరి, కంబాలపల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా సర్వేపై

# ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మిక తనిఖీ



**ఇల్లందు ప్రతినిధి జులై 27, ( తరంగాలు) :**
ఓటర్ల జాబితా నమోదు,సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దే శంతో ఇల్లందు పట్టణంలోని 22, 24వ వార్డుల్లో బి ఎల్ ఎ లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు.వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వేలో ఎమ్మెల్యే పాల్గొని, బి ఎల్ ఎ లు నింపుతున్న ఎస్ ఐ ఆర్ ఫార్మ్‌ను, ఓటర్ల వివరాల నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, బిఎల్ఎలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలనీ సూచించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కొత్త ఓటర్ల నమోదు, పేర్లలో తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ఫార్మ్ నింపడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని బిఎల్ఎ, బిఎల్ఓలను హెచ్చరించారు. వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ మాట్లాడుతూ, తమ వార్డులో ఓటర్ల నమోదు ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అర్హులందరికీ ఓటు హక్కు అందేలా బిఎల్ఎల సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తా మని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, పట్టణ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, 7వ వార్డు కౌన్సిలర్ రాజు గౌడ్, కో ఆప్షన్ మడుగు సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు దొడ్డ డానియల్, చిల్లా శ్రీనివాస్, ఆలేటి చిన్ని, పొట్ల శీను, సిహెచ్. రమేష్, బి ఎల్ ఎ లు కోలపురి ఝాన్సీ, సందీప్, బి ఎల్ ఓ లు అజ్మీర సక్కుబాయి, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.



### కొమరారం, రొంపేడు ప్రభుత్వ పాఠశాలలో

# సర్వే నిర్వహించిన సిపిఎం పార్టీ

- హెడ్మాస్టర్, హిందీ పండిట్ లేకపోవడంతో టెన్త్ క్లాస్ ఫలితాలలో ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం
- రొంపేడు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో పిల్లలు అనేక ఇక్కట్లు



**ఇల్లందు ప్రతినిధి జులై 27,( తరంగాలు):**
ప్రభుత్వ విద్యాలయాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలలో కనీస సౌకర్యా లు కల్పించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కొమరారం ప్రభుత్వ పాఠశాల లో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంలో పలు సమస్యలను గుర్తించడం జరిగింది. ప్రహరీ గోడ కూలే దశలో ఉండడం, ఈ పాఠశాల లో హెడ్మాస్టర్, హిందీ పండిట్ లేకపోవడం తో టెన్త్ క్లాస్ ఫలితాలలో ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ తెలిపారు. వెంటనే హిందీ పండిట్ ని పూర్తిస్థాయి ప్రధానోపాధ్యాయుల్ని నియమించాల్సిందిగా డీఈవో కి పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం రొంపేడు గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థినిలు చెట్ల కింద నిలబడి షెడ్లలో కూర్చొని భోజనాలు చేయడం కనిపించింది, ఈ సమస్య పై ఐటీడీఏ పీవో కి ఈ ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్ లేకపోవడం లోపంగా ఉందని దీనివల్ల పిల్లలు భోజనాలు చేస్తుంటే కోతులు పిల్లల పైకి ఎగబడుతున్నాయని చెట్ల కింద భోజనాలు చేస్తుంటే చెట్లపై నుండి క్రిమి కీటకాలు భోజనంలో పడుతున్నాయని, తక్షణం 600 మంది కి పైగా విద్యార్థినిలు ఉన్న ఈ ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాల్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు, సుడిగాలి వెంకట నరసయ్య, ఎస్కే ఖాదర్,సత్యనారాయణ, కోరి,సలీమా, వెంకన్న, తదితరులు ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు.






జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 28 జూలై, 2026
GENERAL NEWS


## ఎన్ క్యూ ఐ సేవలు అభినందనీయం

- ఇండియా బిషప్ రమేష్ బాలన్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
స్పిరిట్ క్వెస్ట్ ఇంటర్నేషనల్, ఎస్ క్యూ ఐ పెంతుకో డయాసిస్ చేసిన సేవలు అభినందనీయమని బిషప్ రమేష్ బాలన్ అన్నారు. సోమవారం నేలకొండపల్లి మండల పరిధిలో కొత్త కొత్తూరు లొ దహించు అగ్ని కృపా ప్రార్థన మందిరం బిషప్ సతీష్ రెడ్డి, పాస్టర్ లలిత రెడ్డి, ఇండియా ఫైవ్ స్టేట్ బిషప్ ప్రకాష్, ఇండియా స్టాఫ్ పాస్టర్ ధన శేఖరన్, ఆధ్వర్యంలో మ్యారేజ్ లైసెన్సులు డిస్ట్రిబ్యూషన్, ఆర్డినేషన్ ఘనంగా జరిగింది. ఈ సంస్థ మారుమూల గ్రామాల్లో పరిచర్య చేస్తున్నటువంటి సేవకులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. సంస్థలో పనిచేస్తున్న పాస్టర్లకు సామాజిక, ఆరోగ్య భద్రతలను కల్పించినట్లు బిషప్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆడం, మండల పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారి అశ్వీనిని ఆశీర్వదించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.27, తరంగాలు:**
కేసముద్రం మున్సిపాలిటీ 15 వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొల్లూరు శ్రీనివాస్ – రేవతిప్రియ దంపతుల కుమార్తె అశ్వినీ నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుక స్థానిక హరి హర గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ అల్లం రమ, చిన్నారి అశ్వినీకి నూతన వస్త్రాలు అందించి, ఆశీస్సులు అందజేశారు. పాప ఆయురారోగ్యాలతో, ఉన్నత విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓలం సమత, ఓలం కళ్యాణి, విద్యల నిర్మల, శ్రీరామ్ నీరజ, ఓలం కుసుమ, కొత్తపల్లి వాణి మరియు ఇతర నాయకులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఆంగ్లంలోనే బోధించాలి..

- ఆంగ్లంలోనే మాట్లాడాలి...
- మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి...



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జూలై. 27, తరంగాలు:**
ఉపాధ్యా యులు ఆంగ్లంలోనే బోధించాలి,విద్యార్థు లతో ఆంగ్లంలోనే మాట్లాడాలని కోర్సు డైరెక్టర్,కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఎన్రిచ్మెంట్ కార్యక్రమం లో భాగంగా 3 వ రోజు సోమవారం కేసముద్రం విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లము, గణితం పై ఉపాధ్యా యులకు ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా వ్యవహ రిస్తున్న మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడు తూ..ఉపాధ్యాయు లందరూ తరగతి గదిలో బోధన చేసేట ప్పుడు ఏ పిల్లలైతే అభ్యసనంలో వెనుకబడి ఉంటారో వారిని గుర్తించి ఒక గ్రూపుగా విభజించి లక్ష్యాధారిత బోధనను కొనసాగించాలని, అదేవిధంగా మారిన కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులందరూ చక్కగా ఆంగ్లం నేర్చు కుని ఆంగ్లంలోనే విద్యా బోధనను కొనసాగిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం విలేజ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, తాళ్లపూస పల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య,ఆర్పీలు వట్నాల సత్యనారా యణ,వై.అశోక్,వి. భాస్కర రావు,ఎన్నం భాస్కర్, కె.సురేష్ తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శేషాద్రి బాధ్యతల స్వీకరణ



**హనుమకొండ ప్రతినిధి : జులై 27, తరంగాలు :**
హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న శేషాద్రి సోమవారం హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పూర్తి ఆదనవు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కలెక్టర్ శేషాద్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషాద్రికి పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

# భవిష్యత్ తరాల కోసం పంట మార్పిడి...

- మహబూబాబాద్‌లో ప్రాజెక్ట్ వైవిధ్యంకు శ్రీకారం.
- తక్కువ నీటితో అధిక ఆదాయమే లక్ష్యం.. రైతులు ఆరుతడి, పంటల వైపు మళ్లాలి.
- విత్తనమేళలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపు.



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై.27, తరంగాలు:**
వాతావరణ మార్పులు, తగ్గుతున్న వర్షపాతం, భూగర్భ జలాల క్షీణత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాల ఆరోగ్యం, ఆహార భద్రత, రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పంటల వైవిధ్యమే శాశ్వత పరిష్కారమని ఆమె స్పష్టం చేశారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని ఏటిగడ్డ తండ రైతు వేదికలో నిర్వహించిన విత్తనమేళాను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్తో కలిసి ప్రారంభించిన కలెక్టర్, జిల్లాలో ప్రాజెక్ట్ వైవిధ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన విత్తనాల ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలను పంపిణీ చేశారు.

### సూపర్ ఎల్‌నినో ప్రభావం... పంటల ఎంపికలో జాగ్రత్తలు అవసరం : ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిపోవడంతో పాటు నీటి వనరులు కూడా పరిమితంగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు వరిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు, కూరగాయల సాగు చేపడితే తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి రైతు తన పొలంలో సాధ్యమైనంత వరకు పంట మార్పిడి ఏర్పాటు చేసుకోవాలని సూచించిన తకూడా తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నానని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి, ఆరోగ్యకరమైన వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని కోరారు.

### పంటల వైవిధ్యంతోనే సుస్థిర వ్యవసాయం : కలెక్టర్

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పంటలే రైతులకు భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. అందుకే వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా ప్రాజెక్ట్ వైవిధ్యం అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, అగ్రికల్చర్ అధికారులు గ్రామ గ్రామాన రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణమైన పంటలపై రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నారని చెప్పారు.

### వరిసాగుతో పెరుగుతున్న సమస్యలు... ప్రత్యామ్నాయ పంటలకే ప్రాధాన్యం.

అధిక వరి సాగు వల్ల భూసారం క్షీణించడం, అధిక రసాయన ఎరువుల వినియోగం, నిల్వ, రవాణా, మిల్లింగ్ వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ వివరించారు. అదే సమయంలో పసుపు, వేరుశనగ వంటి పంటల సాగు తగ్గిపోవడంతో వాటి ఆధారిత పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు, ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ, మునగ, ఉల్లి వంటి పంటలను సాగు చేస్తే రైతులకు మెరుగైన ఆదాయంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని సూచించారు.

### పంట, మునగ తోటలకు ప్రోత్సాహం.

వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు పంటఏర్పాటు చేసుకోవడంతో పాటు మునగ తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచుతున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ముగింపులో హాజరైన రైతులతో ఆరుతడి పంటలు, కూరగాయల సాగు, పంట మార్పిడి విధానాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న, స్థానిక సర్పంచులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- వసతి గృహాల ఇన్స్పెక్షన్ అధికారులు నివేదికలు సమర్పించాలి
- శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 27, తరంగాలు:**
ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, జిల్లాలోని అన్ని విభాగాల ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ అమలుకు యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో . అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డి.ఆర్.ఓ నాగలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్ ల తొ కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సంది మహబూబ్ రెడ్డి తనకు ఉన్న భూమిలో గల సర్వే నెంబర్ లో ఈ మధ్య జరిగిన భూబారతి డిజిటల్ సర్వే లో తొమ్మిది గుంటలు తక్కువగా చూపిస్తుందని, అట్టి భూమి సర్వేయర్ ద్వారా తిరిగి సర్వే చేపించి సరిచేసి ఇవ్వగలరని కోరారు. మహబూబాబాద్ పట్టణం సిగ్నల్ కాలనీ కి చెందిన శ్రీ రామ మౌనిక తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని, ఇందిరమ్మ ఇల్లు మొదటి జాబితాలో ఇల్లు మంజూరు అయింది కానీ రేషన్ కార్డు లేక పోవడంతో ఇందిరమ్మ ఇవ్వడానికి నిరాకరించారని రెండవ విడతలో నైనా ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన రుద్ర భాస్కర్ తన పాత పాస్ బుక్ లోని పట్టా భూమి ప్రభుత్వం జారీ చేసిన కొత్త పాస్ బుక్ నమోదుకు వచ్చే సరికి మొత్తం భూమి రికార్డు కాలేదని కార్యాలయాల చుట్టూ ఎంత తిరిగిన సమస్యకు పరిష్కారం అవట్లేదని దయచేసి తన సమస్య పరిష్కరించాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజవాణిలో (184) దరఖాస్తులు వచ్చిన వినతులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కొరకు ఆదేశించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విభాగాల వారు ప్రస్తుతం చేస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు శాఖలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని తద్వారా నిర్దిష్టమైన వేగమైన పనులు జరుగుతాయని అట్టి నివేదికలను ప్రతి తనకు సమర్పించాలని కలెక్టర్ సంబంధిత విభాగాలను ఆదేశించారు, ముఖ్యమంత్రి గ్రీవెన్స్, జిల్లా గ్రీవెన్స్ లపై శాకలవారీగా సమీక్ష సమావేశం నిర్వహించి దరఖాస్తుదారులకు వెంటనే లిఖితపూర్వకంగా సమాధానాలు పరిష్కారాలు చూపాలని, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, వారు క్షేత్రస్థాయిలో పిల్లలతో కలిసి భోజనం చేసి వసతి గృహం లోని సౌకర్యాలను తనిఖీ చేయాలని అట్టి నివేదికను వెంటనే తమకు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి



- హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ ప్రతినిధి : జులై 27, తరంగాలు :**
సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. హనుమకొండ నగరంలోని రంగంపేట వద్ద ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, సరుకుల లభ్యత, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ పనితీరును తనిఖీ చేసి, ఇంధన విక్రయాలు, నిర్వహణ, సిబ్బంది విధులు, రోజువారీ లావాదేవీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



అదేవిధంగా సూపర్ బజార్‌లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని పరిశీలించి, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరలు తదితర ఉత్పత్తుల నాణ్యత, విక్రయాలు, నిల్వల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి బి. మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి,

## విత్తన మేళాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలను వినియోగించాలి

• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూలై 27, తరంగాలు:**
ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం నల్లబెల్లి మండలం మేడపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు.ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాల స్టాళ్లను సందర్శించి, వాటి నాణ్యత, అందుబాటు,వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు గుర్తింపు పొందిన సంస్థల ద్వారా సరఫరా చేసే ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు.విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, విత్తనాల సంచులపై ఉన్న వివరాలను పరిశీలించిన తర్వాతే వినియోగించాలని అన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల వినియోగం,పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని, రైతులు ప్రభుత్వ సూచనలను పాటించి శాస్త్రీయ విధానంలో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు,నల్లబెల్లి ఏ .ఓ, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖ ప్రజల సేవకే కట్టుబడి ఉంది

• పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
• చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి
• హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**వరంగల్ ప్రతినిధి , జూలై 27, తరంగాలు :**
పోలీస్ శాఖ ప్రజల సేవకే కట్టుబడి ఉందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. సోమవారం సెంట్రల్ జోన్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్




పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ స్టేషన్ పరిసరాలు, నిర్వహణ, పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. అలాగే స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ పరిధిలో తరచుగా నమోదవుతున్న నేరాలు, గ్రామాల పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితిపై ఇన్‌స్పెక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు పై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలపై వెంటనే స్పందించాలని, చోరీలను అరికట్టేందుకు పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, నమోదైన కేసులపై నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

### రోస్టర్ పాయింట్ల సవరణపై

# ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ సమీక్ష

• అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు, అధికారులు, మాల మహానాడు ప్రతినిధులతో కీలక సమావేశం

**హైదరాబాద్ టౌన్ తరంగాలు న్యూస్ జూలై 27**
హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం ఎస్సీ వర్గీకరణ అమలు నేపథ్యంలో రోస్టర్ పాయింట్ల సవరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గిరిజన, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. అలాగే ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయేంద్ర బోయి, ఐఏఎస్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, శ్రీధర్ తదితర అధికారులు సమావేశంలో పాల్గొని రోస్టర్ పాయింట్ల సవరణకు సంబంధించిన వివిధ అంశాలను సమీక్షించారు. మాల సమాజం తరఫున





మాల మహానాడు అధ్యక్షుడు జి. చెన్నయ్య, రాష్ట్ర కన్వీనర్ దామాల సర్వయ్య, ప్రొఫెసర్ లింబాద్రి, మాల ఐక్యవేదిక అధ్యక్షులు అవుల సుధీర్ తదితర ప్రతినిధులు, సమావేశంలో పాల్గొని రోస్టర్ విధానంలో మాల వర్గానికి ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఉద్యోగాలు, విద్య, పదోన్నతులు మరియు నియామకాలలో మాల వర్గానికి నష్టం కలగకుండా రోస్టర్ పాయింట్ల సవరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినిధుల అభిప్రాయాలను మంత్రులు, అధికారులు శ్రద్ధగా విన్నారని, రోస్టర్ సవరణ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది.

## కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

• కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 27, తరంగాలు :**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మున్సిపాలిటీకి చెందిన మాజీ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, సీనియర్ నాయకుడు, దళితరత్న అవార్డు గ్రహీత కంజర్ల మహేష్ సోమవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రతి నాయకుడు కృషి చేయాలని సూచించారు. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని తెలిపారు.పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ కోసం సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండేటి మహేందర్, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, కంజర్ల మహర్షి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ వసతులు కల్పించాలి

• లోక్‌సభలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**న్యూఢిల్లీ , జూలై 27, తరంగాలు :**
వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పన అంశాన్ని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సమగ్ర వివరాలు కోరారు. ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల పెంపు అంశాలను నిరంతరం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్న డా. కడియం కావ్య, తాజా ప్రశ్న ద్వారా తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన అభివృద్ధి పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను వెల్లడించాలని కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈ-విద్య, దీక్ష, ఐసీటీ



ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల ఆధారంగా కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు.2025--26 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకు రూ.108.98 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల కోసం మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ వసతులు, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత అవసరమని పేర్కొన్న ఆమె, ఈ రంగానికి కేంద్రం మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని డా. కడియం కావ్య స్పష్టం చేశారు.

## 'అధిక దిగుబడులు ఇచ్చే పంటలు సాగు చేయాలి'



**కట్టంగూర్, జూలై 27 తరంగాలు :**
సాంప్రదాయ వరి పంటలకు బదులుగా తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు ఇచ్చే వంటలను రైతులు సాగు చేయాలని కట్టంగూర్ మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్ అన్నారు. సోమవారం కట్టంగూర్ రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మట్లాడారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు లబ్ధి చేకూర్చేలా కంది, పెసర, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆముదం, నువ్వులు తదితర పంటలను వరికి ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని రైతులకు సూచించారు. విత్తన మేళా కార్యక్రమం ఈ నెల 29 వరకు కొనసాగుతుందని, రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కల్లెపల్లి పరుశరాములు, నవీన్, రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి

• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, జూలై 27, తరంగాలు :**
ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలని
వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 189 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 49, డీఆర్డీవో 12, హౌసింగ్ శాఖకు 68 రాగా ఇతర శాఖలకు



సంబంధించి దరఖాస్తులు 60 వచ్చాయాని, వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ హౌసింగ్ ,పెన్షన్ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అట్టి దరఖాస్తులను పరిశీలనార్థం సంబంధిత శాఖలకు ఎండాఫ్ చేస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డిఆర్డిఓ నాగ పద్మజ, డి ఎం ఎం హెచ్ ఓ డా.ప్రకాష్ మరియు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వినతులు సమర్పించారు.


## ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి...
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి.
- ప్రజావాణిలో వివిధ సమస్యలపై 264 అర్జీలు స్వీకరణ.



**హనుమకొండ ప్రతినిధి,: జులై 27, తరంగాలు :**
హనుమకొండ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీ ఇప్పటికే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయబడిందని, సంబంధిత శాఖల అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉండ కుండా బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని, అదేవిధంగా హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న వినతులను కూడా ప్రాధాన్యంగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎల్‌నీనో ప్రభావంతో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జలసిరి కార్యక్రమం కింద పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యతపై గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, స్థానిక సర్పంచులు, రైతులు, గ్రామస్థులతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వరి, పత్తి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా కందులు, పెసర, మినుములు, ఇతర ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, గృహనిర్మాణం, వైద్య ఆరోగ్యం, ఉపాధి, విద్య, విద్యుత్, కార్మిక, భూగర్భ జల వనరులు, రెవెన్యూ, సంక్షేమ శాఖలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 264 అర్జీలు ప్రజలు సమర్పించారు.ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టి, అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ మీన శ్రీను, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అధిక కెఫీన్ కలిగిన ఆ పానీయాలకు ఎనర్జీ డ్రింక్ అనే పదం వాడొద్దు : ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆదేశం




**జూలై 27, తరంగాలు :**
అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్ గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక ఆదేశాలు జారీచేసింది. పెప్సీ , రెడ్ బుల్ మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని పేర్కొన్నది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీచేసింది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది. యూరోమానిటర్ అంచనాల ప్రకారం.. 2028 నాటికి భారత ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ విలువ 1.6 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.

### అనాథ చిన్నారుల భవిష్యత్తుకు

# అండగా వాక్ ఫౌండేషన్

- సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం
- ఇద్దరు చిన్నారుల విద్యాభ్యాసం కోసం రూపాయలు 24 వేల చెక్కు అందజేసిన వాక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ



**వరంగల్ ప్రతినిధి, జూలై 27, తరంగాలు :**
సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరో నిరుపేద కుటుంబాలకు, అనాథ చిన్నారులకు అండగా నిలుస్తున్న వాక్ ఫౌండేషన్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. వరంగల్ 28వ డివిజన్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఉపుల సతీష్ -స్రవంతి దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం బలవన్మరణం చెందడంతో అనాథలైన వారి కుమారులు మాస్టర్ విహాన్, మాస్టర్ విరాట్ విద్యాభ్యాసానికి వాక్ ఫౌండేషన్ చేయూతనందిస్తోంది. ఈ చిన్నారులు పదో తరగతి పూర్తి చేసే వరకు చదువుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని వాక్ ఫౌండేషన్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం 28వ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరు చిన్నారులకు రూ.12 వేల చొప్పున మొత్తం రూ.24 వేల విలువైన రెండు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ, వాక్ ఫౌండేషన్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే 500కు పైగా నిరుపేద కుటుంబాలకు ప్రతి నెలా 10 కిలోల బియ్యం పంపిణీ, ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణ, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల చదువుకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రముఖులు మాట్లాడుతూ సమాజంలో ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, సేవా భావంతో ముందుకు సాగుతున్న వాక్ ఫౌండేషన్ సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సముద్రాల పరమేశ్వర్, పొట్టి శ్రీనివాస్, వెనిశెట్టి రోహిత్, ముంద్రాటి వెంకటేశ్వర్లు, కుచన క్రాంతి, అపురూప్ రజనీష్ నేత, బొడ్డు రాకేష్, అశోక్, అయ్యగారు శ్రీను, మండ్లోజు జగన్, మరాఠీ శ్రీకాంత్, బంటి, రమేష్తో పాటు 28వ డివిజన్ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు
- ధర్మసాగర్ సౌత్ కెనాల్ నుంచి సాగునీటి విడుదల

**వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 27, తరంగాలు :**
రైతులకు అన్ని విధాలా అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుంచి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సాగునీటిని విడుదల చేశారు.ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో రిజర్వాయర్ నుంచి విడుదలైన జలాలకు పసుపు, కుంకుమ, పుష్పాలతో పూజలు నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల పరిధిలోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు సౌత్ కెనాల్ గేట్లను ఎత్తి కాలువల ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నీటిని విడుదల చేస్తున్నామని, వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు నిరంతరాయంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాలువ ఆయకట్టు పరిధిలోని రైతుల సాగునీటి సమస్యకు ఇది కొంత మేర పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, 45వ డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షులు సదానందం, 46వ డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, ఐనవోలు సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ రెడ్డి, దువ్వ నవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# వరంగల్‌లో ఉబర్ బైక్ సేవలకు శ్రీకారం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేతుల మీదుగా ప్రారంభం
- రైడర్లకు హెల్మెట్ల పంపిణీ

**వరంగల్ ప్రతినిధి జూలై 27,తరంగాలు :**
ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ తెలంగాణలోని వరంగల్ నగరంలో ఉబర్ బైక్ సేవలను అధికారికంగా ప్రారంభించింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సోమవారం ఉబర్ బైక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరంగల్‌లో ఇప్పటికే ఉబర్ ఆటో, కార్ సేవలు అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఉబర్ బైక్ సేవలు కూడా ప్రారంభం కావడం నగర ప్రజలకు మరింత ప్రయోజనకరమని అన్నారు. గత కొన్ని రోజులుగా తాను, బండి చైతన్య రెడ్డి ఉబర్ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో వారి సహకారంతో సోమవారం నుంచి ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరంలో ఉబర్ బైక్ సేవలు ప్రజలకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. కాజీపేట, హన్మకొండ, వరంగల్ అనే మూడు అర్బన్ నగరాల మధ్య సమర్థవంతమైన అనుసంధానాన్ని పెంపొందించడంలో ప్రభుత్వ -ప్రైవేట్ భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అలాగే రైల్వే స్టేషన్లు, విమానాశ్రయానికి తొలి, చివరి మైలు కనెక్టివిటీని ఈ సేవలు మెరుగుపరుస్తాయని వివరించారు. ఈ సందర్భంగా ఉబర్ బైక్ సేవలు అందిస్తున్న తొలి 20 మంది రైడర్లకు ఎమ్మెల్యే హెల్మెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజా సేవలో నిత్యం రోడ్డుపై ప్రయాణించే తన సిబ్బందికి కూడా హెల్మెట్లు అందజేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వరంగల్ అభివృద్ధిలో భాగస్వాములైన ఉబర్ బృందానికి విజయాలు కలగాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, నగర ప్రజలకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఉబర్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉబర్ బెంగుళూరు ప్రతినిధులు గీతు నిత్యానందన్, రాయుడు వేణుశ్రీ తేజ, వరంగల్ ఉబర్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.








# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేసీఆర్





- అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడొద్దు
- అవసరమైన అన్ని వైద్య వనరులను వినియోగించాలని కేసీఆర్ సూచన
- చికిత్సకు అవసరమైన ఖర్చు విషయంలో పార్టీ వెనుకాడదు
- యశోద ఆస్పత్రిలో వైద్యులతో సుదీర్ఘ సమీక్ష
- 48 గంటలు కీలకమని వైద్యుల వెల్లడి
- కుటుంబానికి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ అధినేత

**హైదరాబాద్, జూలై 27 (తరంగాలు ప్రతినిధి):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సుమారు 45 నిమిషాల పాటు సమీక్ష నిర్వహించి, ఇప్పటివరకు అందించిన చికిత్స, తదుపరి వైద్య విధానాలపై సమగ్ర వివరాలు తెలుసుకున్నారు.అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యంగా ఉండాలని సూచించారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడొద్దని వైద్యులకు సూచించిన కేసీఆర్, అవసరమైన అన్ని వైద్య వనరులను వినియోగించాలని కోరారు. రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కూడా సూచించినట్లు సమాచారం. వైద్యులు కేసీఆర్‌కు వివరించిన సమాచారం ప్రకారం, పెద్ది సుదర్శన్ రెడ్డి గుండె, ఊపిరితిత్తులు తదితర కీలక అవయవాలు సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ, మెదడు పూర్తిస్థాయిలో స్పందించేందుకు మరికొంత సమయం అవసరమని తెలిపారు. ప్రస్తుతం అత్యాధునిక వైద్య పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్స కొనసాగుతోందని, పరిస్థితిని పూర్తిగా అంచనా వేయడానికి మరో 48 గంటలు కీలకమని వెల్లడించారు. అవసరమైతే విదేశీ నిపుణుల సూచనలతో కూడా చికిత్స కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్న అనంతరం కేసీఆర్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వైద్యులపై పూర్తి విశ్వాసం ఉంచాలని సూచించారు. దేవుడి దయ, వైద్యుల కృషి, ప్రజల ఆశీస్సులతో పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. చికిత్సకు అవసరమైన ఖర్చు విషయంలో పార్టీ వెనుకాడదని, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు చికిత్స పురోగతిని కేసీఆర్‌కు వివరించారు. ప్రతి క్షణం ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్టతో పాటు కుటుంబ సభ్యులతో కేసీఆర్ ప్రత్యేకంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబో లో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భ ంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టు కోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతు న్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.




# పొలిమేర-3లో అర్జున్


టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది.

# అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్

### జైన్ కులం, మతంపై విమర్శలు..పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి





సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు.తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 28 జూలై, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వర్ధన్నపేట రైతు వేదికలో ఘనంగా విత్తన మేళా నిర్వహణ





**వర్ధన్నపేట ప్రతినిధి , జూలై 27, తరంగాలు** :వర్ధన్నపేట రైతు వేదికలో సోమవారం విత్తన మేళా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య మరియు స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఎరువులు, విత్తనాల డీలర్లు తమ సంస్థల ద్వారా అందుబాటులో ఉన్న నాణ్యమైన విత్తనాలను ప్రదర్శించారు. ముఖ్యంగా పెసర, కంది, మినుములు, బొబ్బర్లు వంటి పప్పుధాన్యాల విత్తనాలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నరకుడు వెంకటయ్య, పోశాల వెంకన్న గౌడ్, ఎద్దు సత్య నారాయణ మాట్లాడుతూ, ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం సూచించిన మేరకు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునే కంది, పెసర, అలసంద, మినుములు వంటి పప్పుధాన్యాలతో పాటు జొన్న, కొర్రలు, అండ్రు కొర్రలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలు, అలాగే ఉలవలు, కుసుమ, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. అలాగే ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు గుజ్జ సోమేశ్వరరావు, భూక్యా సంతోష్, తోటకూరి శ్రీనివాస్, గుంటి కుమారస్వామి, ప్రజాప్రతినిధులు మరియు మండలంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన సీతక్క





- ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- వైద్యులతో చికిత్సపై సమీక్ష
- ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ

**హైదరాబాద్, జూలై 27 (తరంగాలు ప్రతినిధి):** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి చికిత్స పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్య బృందాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో, చికిత్సకు శరీరం ఎలా స్పందిస్తోందో వివరాలను పరిశీలించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచి అత్యుత్తమ చికిత్స కొనసాగించాలని వైద్యులను కోరారు. చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రత్యేక వైద్య సేవలను కూడా అందించాలని వైద్య బృందానికి తెలిపారు. రోగి త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మంత్రి కొంతసేపు మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, చికిత్సకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయం ఏదైనా ఉంటే వెంటనే అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటూ ఆయన త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన ప్రజాప్రతినిధులు, ప్రజా సేవకుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన సమయంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరలోనే మెరుగుపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



## దివ్యాంగ యువకుడి కలను సాకారం చేసిన మల్కాజిగిరి పోలీస్ కమిషనర్





**మేడ్చల్--మల్కాజిగిరి, జూలై 27 ( తరంగాలు ప్రతినిధి):** పుట్టుకతోనే దివ్యాంగుడైన యువకుడు రాహుల్ చిరకాలంగా పోలీస్ అధికారి కావాలన్న తన కలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి బడుగుల సాకారం చేశారు. కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించిన రాహుల్‌కు ప్రత్యేక అనుభూతిని కల్పిస్తూ పోలీస్ కమిషనర్ కుర్చీలో కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేశారు. పోలీస్ అధికారిగా ఒక్కరోజైనా సేవలందించాలని ఉన్న రాహుల్ ఆకాంక్షకు ప్రతీకగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనరేట్ అధికారులు అతడిని ఆప్యాయంగా పలకరించి అభినందించారు. తన చిరకాల కోరిక నెరవేరడంతో రాహుల్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోలీస్ టోపీ ధరించి అధికారుల మధ్య కూర్చున్న సందర్భంలో అతని ముఖంలో కనిపించిన చిరునవ్వు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విధి నిర్వహణతో పాటు సమాజం పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించడం కూడా పోలీసు శాఖ బాధ్యతలో భాగమని తెలిపారు. ప్రజలకు చేరువయ్యే పోలీసింగ్‌తో పాటు ఇలాంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు సమాజంలో సానుకూల సందేశాన్ని వ్యాప్తి చేస్తాయని పేర్కొన్నారు.
దివ్యాంగులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు అన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించామని తెలిపారు. ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా మానవత్వాన్ని చాటే కార్యక్రమాలకు కూడా మల్కాజిగిరి పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

## వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షుడిగా మల్లెపాక సమ్మయ్య నియామకం



**వర్ధన్నపేట ప్రతినిధి, జులై 27,తరంగాలు :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లెపాక సమ్మయ్యను వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ నియామకాన్ని జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యత దక్కేందుకు సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు కు మల్లెపాక సమ్మయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన డీసీసీ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్ రాజ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ , జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అబ్బిడి రాజిరెడ్డి, అయినవోలు దేవస్థానం చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ నడుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తుల్ల రవితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులందరికీ ఆయన పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.
ఈ సందర్భంగా మల్లెపాక సమ్మయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను అంకితభావంతో, నిస్వార్థంగా నిర్వర్తిస్తూ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.